క్లుప్తంగా

నేడు 'జగనన్నకు చెబుదాం'

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కారించేందుకు నిర్వహించే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం బుధవారం ఉదయం 10 గంటలకు గూడవల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో బీఎల్‌వీ శేషగిరిరావు, మండల తహసీల్దార్ పి.జాహ్నవి రెడ్డి మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని ప్రజానీకం తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావచ్చని పేర్కొన్నారు. మండల స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ఉంగుటూరు: స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ డి.వనజాక్షి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని స్త్రీశక్తి భవనంలో కార్యక్రమం నిర్వహించేందుకు మంగళవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజాబాబు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్, జిల్లా స్థాయి అధికారులు, ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. మండల స్థాయిలోనే ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని చేపడుతుందని పేర్కొన్నారు. మండలంలోని ప్రజలందరూ తమ సమస్యలను 'జగనన్నకు చెబుదాం' దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

అక్టోబర్ 3 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

విజయవాడరూరల్: వచ్చే నెల 3వ తేదీ నుంచి విజయవాడ రూరల్ మండలంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో బీఎల్‌వీ శేషగిరిరావు తెలిపారు. ఎంపీడీవో, తహసీల్దార్ రెండు టీముల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఉంటాయన్నారు. వచ్చే నెల 3న గూడవల్లి 1, 5వ తేదీల్లో గూడవల్లి-2 సచివాలయాల్లో, 7,10,12 తేదీల్లో నిడమానూరు గ్రామంలోని మూడు సచివాలయాల్లో, 16,18వ తేదీల్లో ఎనికేపాడు గ్రామంలోని రెండు సచివాలయాల్లో, 20, 24, 26 తేదీల్లో ప్రసాదంపాడు గ్రామంలోని మూడు సచివాలయాల్లో, 28, 31, నవంబరు నెల 2వ తేదీన, 4,7 తేదీల్లో రామవరప్పాడు గ్రామంలోని 5 సచివాలయాల్లో, 9వ తేదీన అంబాపురం గ్రామంలో ఎంపీడీఓ టీమ్ ఆధ్వర్యంలో వైద్యులు వైద్య శిబిరాలు ఉంటాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లో కొత్త బ్రేకర్లు ప్రారంభిస్తున్నందున బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నున్న, విలేజికంద్రిక, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, జక్కంపూడి గ్రామం, వేమవరం, కొత్తూరు, తాడేపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పోరంకిలో..

పెనమలూరు: పోరంకి సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పి.హరిబాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం వివరాలు వెల్లడిస్తూ బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ సందర్భంగా పెనమలూరు సెంటర్, బాలాజీనగర్, సాలిపేట, వెంకటేశ్వరగార్డెన్స్, పద్మావతి గార్డెన్స్, 1, 2, 3 ఫేజ్‌లలో విద్యుత్ ఉండదని స్థానికులు సహకరించాలని సూచించారు.

ఇద్దరు కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

పెనమలూరు: మండలంలో ఇద్దరు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి లభించింది. వణుకూరు గ్రామ పంచాయతీలో కార్యదర్శి లక్ష్మయ్యకు ఈవోపీఆర్డీగా చందర్లపాడుకు, చోడవరం కార్యదర్శి బొమ్మసాని శ్రీనివాసరావుకు రెడ్డిగూడెం మండల ఈవోపీఆర్డీగా ఉద్యోగోన్నతి వచ్చింది. ఇద్దరు కార్యదర్శులు రిలీవ్ అయ్యారు.

ఇన్‌చార్జ్ కార్యదర్శులు ఎవరు..?

కాగా చోడవరం, వణుకూరు గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఉద్యోగోన్నతిపై రిలీవ్ అయ్యి సోమవారం వెళ్లారు. వారి స్థానంలో ఇప్పటి వరకు ఆయా గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జ్ కార్యదర్శులను నియమించలేదు. వెంటనే కార్యదర్శులను నియమించాలని కోరుతున్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కార్యదర్శులను నియమించాలని కోరుతున్నారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఉంగుటూరు: గన్నవరం మండలం బల్లిపర్రు వద్ద పోలవరం కాలువలో గల్లంతైన వ్యక్తి మృత దేహం నైనవరం వద్ద కాలువలో మంగళవారం లభించినట్లు ఆత్కూరు ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ తెలిపారు. బల్లిపర్రుకు చెందిన నిమ్మకూరి సామేలు (62) ఈ నెల 10న ప్రమాదవశాత్తు పోలవరం కాలువాలో గల్లంతైన విషయం తెలిసిందే. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

24/7 విద్యుత్



కోలవెన్ను విద్యుత్ సబ్‌స్టేషన్

- పారిశ్రామిక ఫీడర్‌తో రూరల్ ఫీడర్ అనుసంధానం
- కోలవెన్నుకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా
- చిన్న తరహా, కుటీర పరిశ్రమలకు ఊరట

కంకిపాడు: నిన్నటి వరకూ రూరల్ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా.. ప్రస్తుతం పారిశ్రామిక ఫీడర్‌తో అనుసంధానం చేయటంతో 24/7 విద్యుత్ సరఫరాకు మార్గం సుగమం అయ్యింది. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చర్యలు సఫలం కావటంతో కోలవెన్ను గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పీఏసీఎస్ స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మాణం..

ప్రస్తుత కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) కోలవెన్ను గ్రామ సర్పంచ్‌గా ఉండగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు అంశం తెరపైకి వచ్చింది. గ్రామంలోని సామాజిక స్థలాల్లో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తే స్థానికులు కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేయటంతో పాలకవర్గం వాటిని విరమించుకుంది. దీంతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి చెరువు సమీపంలో 20 సెంట్ల స్థలం ఉంది. దీనిని దీర్ఘకాలిక లీజు మీద స్వల్ప అద్దె చెల్లింపు ప్రాతిపదికన విద్యుత్ శాఖకు అప్పగించారు. ఈ స్థలంలో గత టీడీపీ ప్రభుత్వంలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం



పారిశ్రామిక ఫీడర్‌తో అనుసంధానం చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

జరిగింది. అయితే గ్రామానికి త్రీఫేజ్ 24/7 గంటల విద్యుత్ సరఫరా అందించాలన్న ప్రతిపాదన ఉంది. అయితే అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పలు మార్లు స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు, అప్పటి ప్రభుత్వ పెద్దల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ నేతృత్వంలో సమస్యను విద్యుత్ అధికారులకు విన్నవించారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో విద్యుత్ అధికారులు రూ.6 లక్షలు అంచనా వ్యయంతో నెప్పల్లి రూరల్ ఫీడర్‌తో అనుసంధానంగా ఉన్న కోలవెన్ను విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గుడివాడ రోడ్ పారిశ్రామిక ఫీడర్‌తో అనుసంధానం చేయించారు. దీని వల్ల గ్రామంలో చిన్న తరహా, కుటీర పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ అందటంతో పాటుగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందనుంది. ఫీడర్ల అనుసంధానంతో పాటుగా ప్రధాన గ్రామంలోని కొన్ని విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పునకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శాఖాపరమైన అంచనాలను కూడా సిద్ధం చేశారు. త్వరలోనే పనులను పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు. పారిశ్రామిక ఫీడర్‌తో అనుసంధానం చేయటంతో సమీపంలో ఉన్న పునాదిపాడు గ్రామానికి కూడా మెరుగైన విద్యుత్ సరఫరా కానుంది.

కల నెరవేరింది



నేను సర్పంచ్‌గా ఉండగా సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేశాం. అనుకున్నట్లు విద్యుత్ సేవలు మెరుగ్గా అందుతున్నాయి. త్రీఫేజ్ ఫీడర్ అనుసంధానం కావటం మాత్రం ఆలస్యం అయ్యింది. గత టీడీపీ ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదు. ఎమ్మెల్యే పార్థసారథి చొరవ తీసుకున్నారు. అధికారులు స్పందించి మెరుగైన విద్యుత్ పంపిణీ చర్యలు చేపట్టారు. నిరంతర విద్యుత్ సరఫరా కల నెరవేరింది.

–తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి), కమ్మ కార్పొరేషన్ చైర్మన్

మెరుగ్గా విద్యుత్ సరఫరా..



రూరల్ ఫీడర్‌ను పారిశ్రామిక ఫీడర్‌తో అనుసంధానం చేశాం. రూ.6 లక్షలు వెచ్చించాం. చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమల నిర్వాహకులకు ఈ చర్యలు ఊరట. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతానికి మేలు జరుగుతుంది. నాణ్యతాయుతంగా, మెరుగ్గా విద్యుత్ అందుతుంది.

–టీ అశోక్‌కుమార్, విద్యుత్ ఏఈ, కంకిపాడు

ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం

కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్

కంకిపాడు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తుందని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) అన్నారు. కోలవెన్ను పంచాయతీ కార్యాలయంలో 17 మందికి కొత్త పింఛన్లు, 14 మందికి నూతన రేషన్ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పాలన చేరువ చేసిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలు, టీడీపీ నేతల కనుసన్నల్లో పథకాల వర్తింపు జరిగేదని, అది కూడా అరకొరగా అందేవన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను విమర్శించే నైతిక అర్హత ఏ ఒక్కరికీ లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, సగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కంచర్ల వెంకటరావు, మాజీ సర్పంచ్ టొక్కెం సతీష్‌కుమార్, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రేషన్‌కార్డులు అందజేస్తున్న కమ్మకార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి)

సీఎం జగన్‌కు స్వాగతం పలికిన నేతలు

రామవరప్పాడు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లండన్ పర్యటనను ముగించుకుని మంగళవారం గన్నవరం విమానశ్రయం నుంచి రోడ్డు మార్గంలో విచ్చేసిన సందర్భంగా విజయవాడరూరల్ మండలం పలు గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లో ఉదయం 3 గంటల నుంచే జగన్ రాకకోసం ఎదురు చూశారు. ఎనికేపాడులో గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, కోనేరు సుబ్బారావు, పెద్ద సంఖ్యలో మహిళలు, పార్టీ కార్యకర్తలు పుష్పాలు వేదజల్లుతూ స్వాగతం పలికారు. ప్రసాదంపాడులో గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు స్వాగతం పలికారు.



ఎనికేపాడులో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మాదు శివరామకృష్ణ తదితరులు

మాజీ సర్పంచి మస్తాన్‌రావు మృతి



మరీదు మస్తాన్‌రావు



వీర్ల వెంకటేశ్వరరావు

పెనమలూరు: పెనమలూరు గ్రామ మాజీ సర్పంచి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మరీదు మస్తాన్‌రావు (75) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయనకు ఆరోగ్యం బాగాలేక పోవటంతో విజయవాడ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస వదిలారు. 2001 సంవత్సరం నుంచి 2006 వరకు ఆయన పెనమలూరు గ్రామానికి సర్పంచిగా బాధ్యతలు నిర్వర్తించారు. సర్పంచి ఎన్నికల్లో సంచలన విజయం సాధించారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, తాతినేని కోటేశ్వరరావు, పార్టీ నేతలు ప్రగాఢ సంతాపం తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేత మృతి

పెనమలూరు: పోరంకి గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వీర్ల బుజ్జి సోదరుడు వీర్ల వెంకటేశ్వరరావు (59) గుండెపోటుతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, పెనమలూరు నియోజకవర్గ పరిశీలకుడు బొప్పన భవకుమార్ మంగళవారం పోరంకిలో వీర్ల బుజ్జి ఇంటి వద్ద వీర్ల వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తాడిగడప కమిషనర్ ఎస్.ప్రకాశరావుతో పాటు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు భౌతికకాయానికి బుధవారం అంతిమ సంస్కరణలు చేయనున్నారు.



వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

ప్రజల ఆశీర్వాదం సీఎం జగన్‌కే

- మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే పార్థసారథి
- పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం

ఉయ్యూరు: ప్రజల ఆశీర్వాదం సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. పట్టణంలోని ఆరో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథితో కలిసి ఎంపీ బాలశౌరి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పాలన వివరించారు. ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. పథకాల అమలుపై ఆరా తీసి, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారన్నారు. ఏ గడప వద్దకు వెళ్లి ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం అడుగుతున్నా ఆ కుటుంబాలు జగన్ ప్రభుత్వంలో తమకు అన్నీ అందుతున్నాయని చెబుతున్నారన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వలంటీర్ల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌దేనన్నారు. అర్హతే కొలమానంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా సొమ్ము జమ చేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే అన్నారు. పాలనలో పారదర్శకతను తీసుకొచ్చామన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా భావించి పనులు చేస్తున్నామన్నారు. ప్రజలందరూ సీఎం జగన్‌కు బాసటగా నిలిచి ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ జగనన్న పాలన దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. పలు రాష్ట్రాల ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి పథకాల అమలు, పాలనపై అధ్యయనం చేసి ఆయా రాష్ట్రాల్లో అమలుకు శ్రీకారం చుడుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్లు గోన మదన్, ఎండీ బేగ్, తెనాలి పద్మావతి, డాక్టర్ జంపాన పూర్ణిమ, లక్ష్మి, గుంజా సుధాకర్‌బాబు, ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, నాయకులు గుర్రాల సాయి, కాకర్ల రమణ, ఆవుల అమ్మాజీ, కొక్కిలిగడ్డ ప్రదీప్, సత్యనారాయణ, పండు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు ఆరో వార్డులో మహిళతో మాట్లాడుతున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే పార్థసారథి

ట్యాబుల వినియోగంపై శిక్షణ

ఉంగుటూరు: స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో బైజ్యూస్ టాబ్స్ వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. జిల్లా ఐటీ సెల్ అధికారి శివాజీ ట్యాబుల వినియోగంపై అవగాహన కల్పించారు. మండల ఎంఈవో-2 జే సాంబశివరావు పలు సూచనలు చేశారు. జెడ్పీ హైస్కూల్స్ హెచ్‌ఎంలు, ఎంపీపీ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని సంధ్యారాణి మృతికి సంతాపం



పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఉయ్యూరు మండలం కనుమూరు గ్రామానికి చెందిన యలమంచిలి సంధ్యారాణి అనారోగ్యంతో మంగళవారం విజయవాడలో మృతి చెందారు. ఆమె 2017 నుంచి ఇక్కడ పనిచేస్తున్నారు. ఆమె భర్త కూడా ఇదే పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమె మృతికి తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మృతదేహానికి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

లారీ చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కంకిపాడు(పెనమలూరు): లారీ చోరీ కేసులో నిందితుడిని కంకిపాడు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఎస్‌ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. విజయవాడ లబ్బీపేటలో నివాసం ఉంటున్న బొమ్మదేవర వెంకట సుబ్బారావు బీవీఎస్ కార్గో, మూవర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండీ వెంకట సుబ్బారావుకు చెందిన ట్యాంకర్ లారీని లారీ డ్రైవర్ సురేష్ ఈనెల 3వ తేదీ రాత్రి కంకిపాడు మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకు పక్కన రోడ్డు మార్జిన్‌లో పార్కు చేశాడు. 4వ తేదీ ఉదయం లారీ పార్కు చేసిన ప్రదేశానికి వెళ్లి చూడగా లారీ కనిపించలేదు. దీంతో డ్రైవర్ సురేష్ విషయాన్ని యజమాని వెంకట సుబ్బారావుకు సమాచారం అందించారు. వెంకట సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుతో లారీ చోరీ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కంకిపాడు సీఐ వీ.శ్రీనివాసరావుకు అందిన సమాచారం మేరకు ఉప్పులూరు ఖాళీ ఫ్లాట్స్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న పామర్రు మండలం పసుమర్రుకు చెందిన నిడుమోలు పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అందించిన సమాచారంతో ట్యాంకర్ లారీని ఉప్పులూరులో గుర్తించి బాధితులకు అప్పగించారు. నిందితుడు పవన్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

టీడీపీ, జనసేన నాయకులపై కేసుల నమోదు

గుడివాడరూరల్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్ నేపథ్యంలో ఆందోళనలతో ప్రజలకు ఇబ్బంది కలిగించిన టీడీపీ, జనసేన నాయకులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి టూటౌన్ ఎస్‌ఐ పి.నాగరాజు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు వర్గానికి చెందిన టీడీపీ నాయకులు ముళ్లపూడి రమేష్, గోవాడ శివ, నున్న పృథ్వీ, కె.మహేష్, సాలి నవీన్‌కుమార్, వేమండ్ర భరత్‌చంద్ర, వెంకటేశ్వరరావు, మజ్జాడ నాగరాజు, ఎం.అమరేశ్వరరావు, బాతు శ్యామ్‌ప్రసాద్, దేవరపల్లి లక్ష్మీకోటయ్యలపై 161సీఆర్‌పీ కింద బైండోవర్ కేసు నమోదు చేశారన్నారు. టూటౌన్ పీఎస్ వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు వెనిగండ్ల రాము, వెనిగండ్ల రామకృష్ణ, కడియాల గణేష్, నిమ్మగడ్డ సత్యసాయి, కైలా సుబ్బారావు, కఠారి రాంబాబు, అందుగుల ఏసుపాదం, సిరిపురపు తులసీరాణిలతో పాటు మరో 40 మందిపై 341, 143, 188, రెడ్‌విత్ 149 ఐపీసీ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రోడ్డుపై ధర్నా చేస్తూ ట్రాఫిక్ అంతరాయం కలిగించిన జనసేన నాయకులు శ్రీకాంత్, బి.వీర్రాజు, గంగాధర్, పూర్ణచంద్రశేఖర్‌లపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

స్పందన అర్జీలను పెండింగ్‌లో ఉంచొద్దు

విజయవాడరూరల్: స్పందనలో ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని రూరల్ మండల తహసీల్దార్ పి.జాహ్నవి అన్నారు.మంగళవారం మండల తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ స్పందనలో వచ్చే దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలు అడిగిన సర్టిఫికెట్లను వెంటనే జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల సమగ్ర సర్వేకు సంబంధించిన వివరాలను వెంటనే నమోదు చేసి నూరుశాతం రిజల్ట్ చూపించాలన్నారు. గ్రామాల్లో జరిగే రీసర్వే కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. రీ సర్వేలో సరిహద్దురాళ్ల ఏర్పాటు, రికార్డు పనులు, సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో రైతులకు ఇవ్వవలసిన నంబర్లను వెంటనే చేయాలన్నారు. నాలా ఫైల్స్ పెండింగ్‌లో ఉంచుకోవద్దన్నారు. సమావేశంలో ఆర్ఐ, కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

గన్నవరం రూరల్ : అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందని తెంపల్లి సర్పంచ్ కొలుసు శిరీష అన్నారు. మంగళవారం గ్రామంలో కొత్తగా మంజూరైన 26 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తూ ప్రతి గడపకు లబ్ధి చేకూర్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అందరూ మద్దతుగా నిలబడాలని కోరారు. సచివాలయం సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛను అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. మండలంలో పలు సాంకేతిక కారణాలవలన పింఛను అందని వారికి, కొత్తగా మంజూరైన పింఛన్లను ప్రజా ప్రతినిధులు, అధికారులు చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. పొట్టిపాడులో ఎంపీపీ లబ్ధిదారులకు అందజేశారు. ఇందుపల్లిలో ఎంపీడీవో ప్రజా ప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. మండలంలో 269 పింఛన్లు మంజూరు చేశారు. సర్పంచులు బండి వెంకటలక్ష్మి, సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

పెనమలూరు: ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లు బుధవారం పంపిణీ చేస్తామని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ మండల పరిధిలో కొత్తగా రెండు దశల్లో 287 పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గంగూరులో 45, గోసాలలో 44, వణుకూరులో 63, చోడవరంలో 31, పెదపులిపాకలో 28, పెనమలూరులో 76 చొప్పున పింఛన్లు మంజూరయ్యాయన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కొత్త పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారన్నారు.

తాడిగడపలో..

తాడిగడప మున్సిపాలిటీలో కొత్తగా 677 పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసిందని కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. మొదటి విడతలో 309, రెండో విడతలో 368 చొప్పున పింఛన్లు మంజూరు అయ్యాయి.



తెంపల్లిలో కొత్త పెన్షన్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శిరీష



పొట్టిపాడులో పింఛను లబ్ధిదారులతో ఎంపీపీ సరోజిని

200 మందికి అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన వామరాజు వెంకట నరసింహారావు (ఏపూరు కరణం) ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

52 మందికి వైద్య సేవలు



చనుపల్లివారిగూడెంలో రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

గన్నవరం రూరల్: ప్రభుత్వం నాణ్యమైన ఉచిత వైద్యాన్ని గ్రామాల్లో పేదల ఇంటి వద్దకే చేర్చిందని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శివప్రసాద్ చెప్పారు. మంగళవారం మండలంలోని చనుపల్లివారిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామస్తులకు 104 వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెప్పారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకుంటే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. 52 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది సాంబశివరావు, సింధూర, మేరీ గ్రేస్ పాల్గొన్నారు.